క్లుప్తంగా

ప్రశాంతంగా ఈ ఏపీ సెట్ అగ్రికల్చర్ పరీక్ష

పెడన: ఈ ఏపీ సెట్ –2023 అగ్రికల్చర్ పరీక్ష నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం సెషన్‌లో జరిగిన పరీక్షకు 131 మందికి 123, మధ్యాహ్నం సెషన్‌లో జరిగిన పరీక్షకు 131 మందికి 124 మంది హాజరయ్యారని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ బీఆర్ఎస్‌రెడ్డి, పరీక్ష కేంద్రం అడ్మిన్ పి. అశోక్ కుమార్ తెలిపారు.

బహుమతుల ప్రదానం



పెడన: చెన్నూరు గ్రామంలో పది రోజులుగా జరిగిన మండల స్థాయి క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. 15 జట్లకు పైగా పాల్గొన్న పోటీల విజేతలకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు రాజీవ్ బహుమతులను అందజేసి మాట్లాడారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తామని చెప్పారు. క్రీడల్లో ప్రతిభ చూపి జిల్లా, రాష్ట్ర, జోనల్ స్థాయిలకు ఎంపికై ఆర్థిక ఇబ్బందులు పడుతున్నవారు తనను కలవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు, రాజులపాటి అచ్యుతరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు యాదంరెడ్డి ప్రసాదరావు, నాయకులు, కమిటీ సభ్యులు శివ, వాసు, సాయి, దుర్గ, అశోక్ పాల్గొన్నారు.

సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు



కోనేరుసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న కదిరి – లేపాక్షి 1812 రకం విత్తనాలను రైతులు తీసుకుని అధిక దిగుబడులు సాధించాలని కానూరు పీఏసీఎస్ అధ్యక్షుడు, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు శ్రీకాకుళపు నాగేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అభ్యుదయ రైతులకు సబ్సిడీపై కదిరి-లేపాక్షి వేరుశనగ విత్తనాలను మంగళవారం అందజేశారు. కానూరులో జరిగిన కార్యక్రమంలో నాగేశ్వరరావు రైతులకు సబ్సిడీ విత్తన సంచులను అందజేసి మాట్లాడారు. మండల వ్యవసాయ శాఖాధికారి జీవీ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చూడామణి, వీఏఏలు మహాలక్ష్మి, ప్రసన్న, ఖాసీం ఝాన్సీ, రైతులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



చల్లపల్లి: మండు వేసవిలో ప్రతిరోజూ మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమని సీఐ బి.భీమేశ్వర రవికుమార్ అన్నారు. మంగళవారం స్థానిక బందరు రోడ్డులోని బస్టాప్, ఆటో స్టాండ్ వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ చల్లపల్లి వీఆర్‌కే నగర్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సీఐ రవికుమార్, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి ప్రారంభించి మాట్లాడారు. తొలిరోజు క్లబ్ కార్యదర్శి నర్రా సాయిబాబు ఆర్థిక సాయంతో వెయ్యి మందికి మజ్జిగ పంపిణీ చేశారు. క్లబ్ ప్రతినిధులు, దాతల సాయంతో ఈ కార్యక్రమం కొనసాగిస్తామని క్లబ్ అధ్యక్షులు ఏఎల్ఆర్‌కే ప్రసాద్ తెలిపారు. క్లబ్ పెద్దలు పాల్గొన్నారు.

మహాప్రస్థానం వాహనం అందజేత

ఘంటసాల(అవనిగడ్డ): అంతిమ సంస్కారాల కోసం ప్రజలకు ఉపయోగపడే విధంగా కొడాలికి చెందిన కంచర్ల వెంకటరత్నం- శివసామ్రాజ్యం జ్ఞాపకార్థం వారి కుమారులు కంచర్ల సునీల్, అనిల్ రూ.6 లక్షల విలువగల మహాప్రస్థానం వాహనాన్ని అందించారు. మంగళవారం కొడాలిలో జరిగిన కార్యక్రమంలో ఈ వాహనాన్ని జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ చేతుల మీదుగా గ్రామస్తులకు అందజేశారు. అంతిమ సంస్కారం సమయంలో ప్రజలకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో ఈ వాహనాన్ని అందించామని దాతలు చెప్పారు. కొడాలి పరిసర ప్రాంత ప్రజలు ఈ వాహనాన్ని వినియోగించుకోవాలని సూచించారు. దాతలను ఘనంగా సత్కరించారు.

టిడ్కో ఇళ్లకు నీటి సరఫరా పనులు

గుడివాడ టౌన్: పంపిణీకి సిద్ధంగా ఉన్న టిడ్కో గృహాలకు తాగునీటిని అందించేందుకు పూర్తి ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం మున్సిపల్ ఇంజినీర్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ప్రధాన పైప్‌లైన్ జాయింట్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సంపునకు ఈ పైప్ లైన్ ద్వారా నీరు సరఫరా అవుతుందన్నారు. వాటి నుంచి అన్ని బ్లాకుల ఓవర్ హెడ్ ట్యాంకుల మోటార్ల ద్వారా తాగునీరు పంపిణీ చేస్తామని వివరించారు.

వలంటీర్లు.. సంక్షేమ వారధులు

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- వలంటీర్లకు అవార్డుల ప్రదానం, సత్కారాలు



అవార్డులను అందించి వలంటీర్‌ను సన్మానించిన ఎమ్మెల్యే సింహాద్రి



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్

కోడూరు: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సంక్షేమ వారధులుగా విధులు నిర్వహిస్తున్న వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. మండల స్థాయి వలంటీర్ల వందనం కార్యక్రమం కోడూరు పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కావడంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. పథకాలను అవినీతి, అక్రమాలకు తావు లేకుండా వలంటీర్లు ప్రజలకు చేరవేస్తూ ప్రభుత్వ ప్రతిష్టను పెంచుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో అమలవుతున్న వలంటీర్ల వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని, దీనిని ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు చేసేందుకు ఆయా ప్రభుత్వాలు ఉత్సాహం చూపడం మన పాలన పనితీరుకు అద్దంపడుతుందన్నారు. వలంటీర్లను ప్రజలు తమ కుటుంబ సభ్యులుగా భావించడాన్ని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తాను స్వయంగా చూశానని, ఇదే స్ఫూర్తితో పని చేయాలని రమేష్‌బాబు కోరారు.

వలంటీర్లకు సత్కారం..

మండలంలోని లింగారెడ్డిపాలెం సచివాలయ పరిధిలోని నక్కవానిదారి గ్రామంలో విధులు నిర్వహించే అప్పికట్ల రాంబాబుకు సేవా వజ్ర అవార్డు లభించగా, దీనిని రమేష్‌బాబు వలంటీర్‌కు అందించి, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. సేవా రత్న అవార్డులు పొందిన పరిసే రజిని (కోడూరు-1), దాసరి తిరుపతమ్మ (లింగారెడ్డిపాలెం), మోకా నాగరేఖ (సాలెంపాలెం), కమ్మిలి వెంకటరమణ (ఉల్లిపాలెం), అప్పికట్ల ఆదిశేషయ్య (వి.కొత్తపాలెం)లను సత్కరించి అవార్డులను అందించారు. వీరితో పాటు మండలంలోని 11 సచివాలయాల పరిధిలో 246 మంది వలంటీర్లకు సేవా మిత్ర అవార్డులు లభించాయి. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, సర్పంచులు వెన్నా షైనీ, వెర్రీ పావని, కొక్కలిగడ్డ భిక్షాలు, యలవర్తి నాంచారయ్య, పార్టీ జిల్లా రైతు విభాగ కార్యదర్శి కొండవీటి వీర వెంకటనారాయణరావు, జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ గుర్రం బసవయ్య, ఎంపీడీఓ పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో సుభిక్షంగా రాష్ట్రం..

గణపేశ్వరం(నాగాయలంక): నవరత్న పథకాల అమలుతో రాష్ట్రాన్ని సుభిక్షంగా, సుస్థిరంగా నిలిపే శక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మాత్రమే ఉందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గణపేశ్వరం సచివాలయం పరిధిలోని గణపేశ్వరం గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు, ఆయన తనయుడు సింహాద్రి వికాస్‌తో కలిసి 228 గృహాలకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. గత పాలకులు నిషేధించిన భూముల జాబితా నుంచి ముఖ్యమంత్రి జగనన్న ఆ భూములను తొలగించడంతో గ్రామంలో 158 మంది రైతులకు చెందిన 193.30 ఎకరాలు రిజిస్ట్రేషన్‌కు అవకాశం కలిగిందని రైతులు ఎమ్మెల్యేకు చెప్పి సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు, నియోజకవర్గం సచివాలయాల కన్వీనర్ మద్ది వెంకట నారాయణ (చిన్నారి), వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భోగాది శేషగిరిరావు, పీఏసీఎస్ అధ్యక్షులు తోట సాయిబాబు, సర్పంచి బెల్లంకొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలి

చల్లపల్లి: గ్రామంలోని రోడ్లు భవనాల శాఖకు చెందిన కోట్లాది రూపాయల విలువైన స్థలం అన్యాక్రాంతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కల్యాణి అన్నారు. మంగళవారం స్థానిక ఆర్ అండ్ బీ కార్యాలయం వెనుక ఉన్న ట్రావెలర్స్ బంగ్లా స్థలంలో తాజాగా వెలసిన బసక, మట్టి గుట్టలను జెడ్పీటీసీ కల్యాణి పరిశీలించారు. ఈ బంగ్లాను అభివృద్ధి చేసి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని అనేకసార్లు అధికారులకు విజ్ఞప్తి చేశామని ఆమె చెప్పారు. ఆర్ అండ్‌బీ శాఖకు చెందిన ఈ విలువైన స్థలంపై ఆక్రమణదారుల కన్ను పడిందన్నారు. అధికారులు తక్షణమే స్పందించి సరిహద్దులు గుర్తించి ప్రహరీ నిర్మించాలని కోరారు. గతంలో ఎంతోమంది ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులతో కళకళలాడిన ఈ బంగ్లా పునర్నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

25, 26 తేదీల్లో తాగునీటి సరఫరా నిలిపివేత

పెడన: పట్టణంలో రెండు రోజులు పాటు తాగునీటి సరఫరాను నిలుపుదల చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఎం. అంజయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25, 26వ తేదీల్లో పూర్తిగా తాగునీటి సరఫరాను నిలుపుదల చేస్తామన్నారు. గూడూరు మండలం తరకటూరు నుంచి పెడన పట్టణానికి వచ్చే పైపులైన్లు మార్చుతున్నామని చెప్పారు. ఈనెల 27వ తేదీ నుంచి యథావిధిగా తాగునీటిని సరఫరా చేస్తామని వివరించారు. ప్రజలు సహకరించాలని కోరారు.

తీరప్రాంత ప్రజలకు పుష్కలంగా తాగునీరు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



ఎమ్మెల్యే రమేష్‌బాబుకు కేక్ తినిపిస్తున్న నేతలు

కోడూరు: తీరప్రాంత ప్రజలకు పుష్కలంగా తాగునీరు అందిస్తున్నామని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. రమేష్‌బాబు ఎమ్మెల్యేగా గెలిచి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కోడూరు పంచాయతీ వద్ద వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. రమేష్‌బాబు మాట్లాడుతూ.. కోడూరు మండలం రామకృష్ణాపురం పంచాయతీలోని ఇరాలి, ఊటగుండం, రామకృష్ణాపురం గ్రామాల్లో ఉదయం వేళ కుళాయిల వెంట తాగునీటి విడుదల చేస్తుంటే, సాయంత్రం వేళ బుద్ధప్రసాద్ ఈ గ్రామాల్లో పర్యటించి గుంతల్లో ఉన్న మురుగు నీటిని బిందెల్లో నింపి, ఈ నీరు కుళాయిల వెంట వస్తున్నాయంటూ విషప్రచారం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. గత ప్రభుత్వంలో తీరప్రాంత ప్రజలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారని, ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేకుండా పుష్కలంగా నీటిని అందిస్తున్నామన్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి డెల్టా ఆధునికీకరణ పేరుతో దివిసీమకు రూ.165 కోట్లు కేటాయిస్తే, ఆ నిధులతో అనవసరమైన ప్రాంతాల్లో బుద్ధప్రసాద్ కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేలా వంతెనలు నిర్మించారే గాని రైతులకు ఉపయోగపడే అవుట్‌పాల్ స్లూయిస్‌లను ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో బుద్ధప్రసాద్ ఎంత హడావుడి చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు.

కోడూరు–అవనిగడ్డ రహదారిని త్వరలోనే నిర్మిస్తాం..

కోడూరు–అవనిగడ్డ రహదారిని వైఎస్సార్ సీపీ ఖచ్చితంగా నిర్మిస్తుందని, త్వరలోనే పనులను కూడా చేపడతామని రమేష్‌బాబు అన్నారు. రహదారి నిర్మాణంపై ప్రజల్లో ఉన్న అపోహలను పూర్తిగా తొలగించుకోవాలన్నారు. ఇప్పటికే రహదారి నిర్మాణానికి రూ.35 కోట్లు ప్రతిపాదనలు పంపామని, రహదారి నిర్మాణానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందన్నారు. ప్రజల సమస్యను తాత్కాలికంగా పరిష్కరించేందుకు ఇటీవల రూ.40 లక్షలతో రహదారికి మరమ్మతులు చేపట్టామని చెప్పారు. అనంతరం నేతలతో కలిసి కేక్ కట్ చేశారు.

ప్రభుత్వంపై విష ప్రచారం మానుకోవాలి

ప్రభుత్వంతో పాటు నియోజకవర్గ సమస్యలపై మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ చేస్తున్న విష ప్రచారాన్ని మానుకోవాలని ఎమ్మెల్యే రమేష్ బాబు అన్నారు. కరోనా వంటి కష్ట కాలంలో కనిపించని బుద్ధప్రసాద్ ఇప్పుడు నియోజకవర్గంలో హడావుడి పర్యటనలు చేస్తూ ప్రభుత్వంపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గ సమస్యలు గురించి ఎప్పుడూ పట్టించుకోని బుద్ధప్రసాద్, ఇప్పుడు రైతుల కోసం దీక్షలు చేస్తానని హెచ్చరించడం విడ్డూరంగా ఉందన్నారు. కవి సమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాల పేరుతో కాలక్షేపం చేసి నియోజకవర్గ సమస్యలను గాలికొదిలేసిన ఘనత బుద్ధప్రసాద్‌కే దక్కుతుందన్నారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

దళితుల పక్షపాతి సీఎం జగన్

- అంబేడ్కర్ భవన్‌కు రూ. 5 కోట్ల మంజూరుపై హర్షం
- సీఎం జగన్, ఎమ్మెల్యే పేర్ని నాని చిత్రపటాలకు క్షీరాభిషేకం



సీఎం జగన్, ఎమ్మెల్యే పేర్ని నాని చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దళిత జేఏసీ ప్రతినిధులు

మచిలీపట్నంటౌన్: దళితుల సంక్షేమానికి కృషి చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళితుల పక్షపాతిగా చరిత్రలో నిలిచిపోతారని దళిత జేఏసీ ప్రతినిధులు అన్నారు. నగరంలో శిథిలావస్థకు చేరిన అంబేడ్కర్ భవన్ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం జరిగిన బహిరంగ సభలో రూ. 5 కోట్లు మంజూరు చేయడంపై దళిత వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. దీనిలో భాగంగా దళిత జేఏసీ ప్రతినిధులు మంగళవారం స్థానిక గాడెల్లి కల్యాణ మండపం వద్ద సీఎం జగన్, ఎమ్మెల్యే పేర్ని నాని చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. దళిత జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ స్థానిక అంబేడ్కర్ భవన్ శిథిలావస్థకు చేరి కార్యక్రమాల నిర్వహణకు అనుకూలంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) దృష్టికి తీసుకువెళ్లడంతో బహిరంగ సభలో ప్రస్తావించారన్నారు. దీనికి స్పందించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రూ. 5 కోట్లు మంజూరు చేశారన్నారు. సీఎం జగన్, పేర్ని నానికి కృతజ్ఞతలు తెలిపారు. దళిత జేఏసీ కన్వీనర్ జక్కుల ఆనందబాబు, కార్పొరేటర్లు యండ్రపాటి నాగేశ్వరరావు, ఏకశిరి వెంకటేశ్వరరావు, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, మాజీ కౌన్సిలర్ కొక్కిలిగడ్డ శరత్‌కుమార్, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ కన్వీనర్ ఎగ్గోని గాంధీ, దళిత జేఏసీ నాయకులు బందెల థామస్ నోబుల్, బూరగ రామారావు, శీనయ్య మాస్టర్, దార్ల చెన్నకేశవరావు, మైఖేల్ పాల్గొన్నారు.

చెన్నూర్ హైస్కూల్ ప్లస్‌లో అడ్మిషన్లపై ప్రచారం



విద్యార్థినికి అడ్మిషన్ ఫారం అందజేస్తున్న సౌజన్య

పెడన: చెన్నూరు జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన హైస్కూల్ ప్లస్ బాలికల జూనియర్ కళాశాలలో చేరి భవితను తీర్చిదిద్దుకోవాలని జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సీహెచ్ సౌజన్య అన్నారు. మంగళవారం చెన్నూరు గ్రామంలో ఇటీవల పదో తరగతిలో ఉత్తీర్ణులైన బాలికల ఇంటింటికి వెళ్లి అడ్మిషన్ ఫారాలను అందజేస్తూ ప్రచారం నిర్వహించారు. హెచ్ఎంతో పాటు హైస్కూల్ ప్లస్‌కు ఇటీవల బదిలీపై వచ్చిన పోస్టు గ్రాడ్యుయేట్ (పీజీటీ) టీచర్లు, ఇతర ఉపాధ్యాయులు బృందాలుగా ఏర్పడి విద్యార్థినులను కలిసి అడ్మిషన్ ఫారాలను అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులతో వారు మాట్లాడి తమ కళాశాలలో చేర్పించాలని విన్నవించారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులున్నాయని, ఒక్కో గ్రూపులో 40 సీట్లు వరకు ఉన్నాయని వివరించారు.

- మోపిదేవి: ఉత్తమ శిక్షణ, అత్యుత్తమ బోధన, ఫలితాలకు పిల్లలను మోపిదేవి జెడ్పీ పాఠశాల, కళాశాలలో చేర్పించాలని ఉపాధ్యాయులు తల్లిదండ్రులను కోరారు. స్థానిక జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి కరపత్రాలు అందజేశారు. హెచ్ఎం జయంతి మాట్లాడుతూ జెడ్పీ పాఠశాలలో ఇటీవల వచ్చిన పదో తరగతి ఫలితాల్లో 9 మంది 500లకు పైగా మార్కులు సాధించారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది హైస్కూల్ ప్లస్ (బాలికల)కళాశాలగా పదోన్నతి కల్పించిందని తెలిపారు. ఎంపీసీ(40), బైపీసీ(40) ఇంగ్లిష్ మీడియంలో ఒక్కో గ్రూపునకు 40 మంది చొప్పున సీట్లు కేటాయించిందని వివరించారు.

టెన్త్ విద్యార్థులకు సహాయ ఫౌండేషన్ పురస్కారాలు



విద్యార్థినికి మెమెంటో అందజేస్తున్న బాలాజీ

పెడన: పట్టణానికి చెందిన సహాయ ఫౌండేషన్ మంగళవారం పదో తరగతి మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాన్ని, ప్రతిభా పురస్కారాలను అందజేశారు. స్థానిక షాదీఖానాలో జరిగిన కార్యక్రమంలో పెడన మండలంలో అత్యధిక మార్కులు సాధించిన కళాంజలి విద్యార్థినికి రూ.3 వేలు, పెడన బీజీకే జెడ్పీహెచ్ఎస్‌లో ఇద్దరికి, పెడన మండలం పెనుమల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఒకరికి, గూడూరు మండలం కప్పలదొడ్డి జెడ్పీహెచ్ఎస్‌లో ఒకరికి రూ.2 చొప్పున రూ.8 వేలను అందజేశారు. గూడూరు, పెడన మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు మెమెంటోలు, ప్రతిభా పురస్కారాలను అందించారు. అనంతరం పెడన బీజీకే జెడ్పీహెచ్ఎస్ నుంచి అమెరికాలో జరిగిన అంతర్జాతీయ సైన్స్ ఫెయిర్‌లో నాలుగో స్థానంలో నిలిచిన ప్రాజెక్టు స్మార్ట్ సొల్యూషన్ ఫర్ ఏకో పొల్యూషన్‌ను తయారు చేసిన విద్యార్థులు వినయ్‌కుమార్, మణికంఠతో పాటు ఉపాధ్యాయులు లక్ష్మీదేవి, పాఠశాల హెచ్ఎంలను సహాయ ఫౌండేషన్ సభ్యులు సన్మానించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా, మామిడి ప్రసాద్, లంకిశెట్టి బాలాజీ, మోటేపల్లి రత్నారావు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు సకాలంలో అందించాలి

కోనేరుసెంటర్: కృష్ణా యూనివర్సిటీలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మార్కుల జాబితాను సకాలంలో అందజేసేందుకు కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం విజ్ఞప్తి చేశారు. మంగళవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కృష్ణా విశ్వవిద్యాలయం ఉప కులపతికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఎల్ఎల్‌బి, ఫార్మసీ, బీఈడీ, స్పెషల్ బీఈడీ, పీజీ తదితర కోర్సులకు సంబంధించిన మార్కుల జాబితా జారీ విషయంలో జరుగుతున్న ఆలస్యం వల్ల విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తోట బాబు, జోగి శివ, పామర్తి బాల, పుట్టి రాజశేఖర్, ఎం. పవన్ తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్యంలో విద్యార్థినులకు శిక్షణ



అవనిగడ్డలో కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

అవనిగడ్డ: స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డాన్స్ టీచర్ ఎం. మానస కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇచ్చారు. ఆధ్యాత్మిక గురువు ఎం. శేషగిరిరావు భగవద్గీత పఠనం, శ్లోకాలు చెప్పించారు. ఇంగ్లిష్ టీచర్ ఎ. సీతారాం కథలు చెప్పడం, పద్యాలు చదవడం నేర్పించారు. గ్రంథాలయ అధికారి జుజ్జువరపు ప్రభుదాస్ పర్యవేక్షించారు.

ఘంటసాలలో..

ఘంటసాల గ్రంథాలయంలో విద్యార్థులకు వివిధ అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. డ్రాయింగ్, కథలు చెప్పడం, క్యారంబోర్డు, చెస్, స్కిప్పింగ్, డాన్స్‌లో శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయ అధికారి ఎం. శరత్ కుమార్ పర్యవేక్షించారు.

ఆట పాటలు, పాఠాలు..

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా మంగళవారం విద్యార్థులు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులు పాటలకు డ్యాన్స్ చేసి కోలాటం ఆడారు. భగవద్గీత శ్లోకాలను, దేశభక్తి గీతాలను నేర్చుకున్నారు. క్లాసికల్ డ్యాన్స్ చేయించారు. ఈడేపల్లి, చిలకలపూడి గ్రంథాలయాల్లో భగవద్గీత శ్లోకాలతో పాటు కథలు చెప్పి పుస్తకాలు చదివించారు. ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్ పర్యవేక్షించారు.

ప్రమాదాల నియంత్రణకు పరిశీలన

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పా రింగ్ సమీపంలో జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు మంగళవారం పోలీసు, ట్రాఫిక్, నేషనల్ హైవే, ట్రాన్స్‌పోర్టు ఉన్నతాధికారులు జాతీయ రహదారిపై పలు ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ అంశాలపై చర్చించారు. ఏసీపీలు సురేష్ రెడ్డి, భాస్కరరావు, పటమట సీఐ కాశీవిశ్వనాథ్, ట్రాఫిక్ సీఐ బాల మురళి, నేషనల్ హైవే ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ట్రాన్స్‌పోర్టు నుంచి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ వరి శ్రీదేవి తదితరులు జాతీయరహదారిపై పలు ప్రదేశాలను పరిశీలించారు. ప్రమాద నివారణ చర్యలపై చర్చించారు. రామవరప్పాడు రింగ్ సమీపంలో ఎడమవైపు వాల్ ఎత్తుగా ఉండటం వల్ల కుడి వైపు వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గుర్తించారు. ఈ స్లోప్‌ను సమాంతరంగా చేయాలని నిర్ణయం తీసుకున్నారు. కరెన్సీనగర్ సర్వీసు రోడ్డులో బైలైన్స్ వల్ల ఎదురుగా వచ్చే వాహనాలతో ప్రమాదం ఉన్నందున క్లోజ్ చేయాలని నిర్ణయించారు. ఇన్నోటల్ ఆపోజిట్ రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఏపుగా పెరిగిన మొక్కలను శుభ్రపరచాలని, రామవరప్పాడు రింగ్‌లోని 'ఐ లవ్ విజయవాడ' వద్ద ఉన్న రింగ్ పరిమాణం ఎక్కువగా ఉండటం వల్ల ఇక్కడి రహదారి వైశాల్యం తగ్గి ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని గుర్తించారు.

పంచాయతీ తీర్మానంతో చుట్టూ ఉన్న రింగ్ పరిమాణాన్ని తగ్గించాలని నిర్ణయానికి వచ్చారు. ఈ చర్య వల్ల రహదారి వెడల్పు పెరుగుతుందని తద్వారా ట్రాఫిక్ సాఫీగా సాగుతుందని తెలిపారు. గుర్తించిన పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

కోడూరు జట్టుపై చెరుకుపల్లి జట్టు విజయం

మోపిదేవి: మోపిదేవి జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. మంగళవారం చెరుకుపల్లి జట్టు, కోడూరు జట్టు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన చెరుకుపల్లి జట్టు నిర్ణీత 12 ఓవర్లకు 7 వికెట్లు కోల్పోయి 103 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కోడూరు జట్టు నిర్ణీత 12 ఓవర్లకు 7 వికెట్లు కోల్పోయి 70 పరుగులు మాత్రమే చేయగలిగింది. మూడు వికెట్లు తీసిన అమర్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. రంగిశెట్టి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

బందరులో ఈదురు గాలులతో వర్షం



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరంలో మంగళవారం ఉదయం 6.30 గంటల సమయంలో ఈదురు గాలులతో వర్షం కురిసింది. నగరంలోని ప్రధాన రహదారిలో మునిసిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న సెంట్రల్ లైటింగ్ స్తంభం ఒరిగింది. సెంట్రల్ లైటింగ్ గ్రిల్స్‌పై విద్యుత్ స్తంభం వాలడంతో పెనుప్రమాదం తప్పింది.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కోనేరుసెంటర్: వ్యాను బోల్తాపడిన ఘటనలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని ఓ వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. బందరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన వ్యక్తి ఈ నెల 21వ తేదీన ఏపీ 36 టీఎఫ్ 3617 నంబరు గల బొలేరో వ్యాన్‌లో పాలకొల్లుకు బయలుదేరాడు. బందరు మండలంలోకి ప్రవేశించిన వ్యాను ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. క్షతగాత్రుడిని మచిలీపట్నంలోని సర్వజన ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న బాధితుడు మంగళవారం మృతి చెందాడు. అతని ఆచూకీ తెలిసిన వారు సెల్: 94407 96417, 08672223322 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందజేయాలని ఎస్ఐ చాణక్య కోరారు.

ప్రకటన

[illegible]

పి. రామమోహనరావు, దామ లక్ష్మణ కుమార్, ఎ.రాజురాజేశ్వరి, అడ్వకేట్స్,
డోరు నెం.23-2-1, సత్యనారాయణపురం, విజయవాడ-11. సెల్: 9392114822